

ఏరియా ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్ అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): దశాబ్ది కాలంలో తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఆవిర్భావ ముగింపు వేడుకల్లో భాగంగా వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో రోగులకు ఎమ్మెల్యే పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్బీ నగర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. అందులో భాగంగా నాగోల్‌లో ఎస్.టీ.పీ ప్లాంట్లు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఎస్.ఎన్.డీ.పీ పనుల వల్ల ఎన్నో సత్ఫలితాలు వస్తున్నాయన్నారు. కొన్ని పనుల్లో ఎన్నో ఇబ్బందులు ఎదురైనా వాటిని అధిగమిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. మిగిలిన ఇంకా కొన్ని పనులు చివరి దశలో ఉన్నాయని, వాటిని కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పూర్తి స్థాయిలో పనులు పూర్తి చెస్తామన్నారు. ఎల్బీనగర్ అభివృద్ధి నా లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్.ఎం.ఓ డాక్టర్ కృష్ణ, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, గజ్జెల మధుసూదన్ రెడ్డి, సుమన్‌గౌడ్, మధు గౌడ్, సామ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ ముగింపు వేడుకలు

సైదాబాద్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ ముగింపు వేడుకలను పురస్కరించుకుని సోమవారం బీఆర్ఎస్ యాఖత్‌పురా నియోజకవర్గం ఆధ్వర్యంలో ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్‌లోని జీఎంఆర్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ స్వప్నాసుందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు మెట్టు భాస్కర్‌రెడ్డి, ప్రవీణ్‌రాజ్, శ్రీనివాస్, నర్సింగరావు, నాయకులు సాబేర్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు యోగా ఎంతో మేలు

వనస్థలిపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిరక్షణకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురంలోని జయశంకర్ పార్కులో భారతీయ యోగా సంస్థాన్ ఆధ్వర్యంలో నిరంతర ఉచిత యోగా శిక్షణ కేంద్రాన్ని సోమవారం కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్య పరిరక్షణకు కొంత సమయాన్ని యోగాకు కేటాయిస్తే ఆరోగ్యంగా జీవించడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు కిరణ్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, గణేష్, వెంకటేశ్వర్లు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి: లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని శివారు కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. వివేకానంద కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కార్పొరేటర్ కాలనీలో పర్యటించి కాలనీవాసుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కాలనీలో విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు, త్రీఫేస్ విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీవాసులు కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ త్వరలోనే ప్రతి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవతీసుకుని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాలనీ అధ్యక్షుడు వెంకటాచలం, సభ్యులు విక్రమ్, భ్రమరాంబ, ముత్యాలు, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎన్నికైన సహారా ఎస్టేట్స్ నూతన కమిటీ సభ్యులు

సహారా ఎస్టేట్స్ మెయింటెనెన్స్ కమిటీ ఎన్నిక

వనస్థలిపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని సహారా ఎస్టేట్స్ మెయింటెనెన్స్ నూతన కమిటీ సోమవారం ఎన్నికైంది. నూతన అధ్యక్షుడిగా సయ్యద్‌జానీ, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసరావు, మేకల ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్‌రెడ్డి, కోశాధికారిగా శేఖరయ్య, సంయుక్త కార్యదర్శులుగా భీమానాయక్, ఆర్.మంజుల, కార్యవర్గ సభ్యులుగా కోట్ల శ్యాంప్రసాద్, జ్యోతి, తృప్తి అగర్వాల్, విజయలక్ష్మి, కవిత, లత, వెంకటేశ్వర్‌రావు, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, మంగమ్మ, ఏవీరావు, రమ, అమరనాథ్, నర్సింహగౌడ్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సహారా ఎస్టేట్స్ నివాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తమ ఎన్నికకు కృషి చేసిన కాలనీవాసులకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నేత్రపర్వంగా శ్రీకృష్ణరాయబారం పౌరాణిక పద్యనాటకం

ఎల్బీనగర్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఆర్కేపురం డివిజన్‌లోని శ్రీరామకృష్ణపురంకాలనీలో ఇన్‌కాంటాక్స్‌కాలనీ సొసైటీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన శ్రీకృష్ణరాయబారం పౌరాణిక పద్యనాటకం ఆద్యంతం నేత్రపర్వంగా సాగింది. నటీనటులు నటనా కౌశలంతో ముఖ్యంగా పద్యాలాపనతో ప్రేక్షకులను ఓలలాడించారు. దుర్యోధనుడిగా కొట్టె వెంకటాచార్యులు, శ్రీకృష్ణుడిగా డాక్టర్ సూలపాణి, గాంధారిగా సావిత్రి తదితరులు తమ నటనాచాతుర్యంతో ఆకట్టుకున్నారు. శ్రీకృష్ణుడి పాత్రధారి డాక్టర్ సూలపాణి మాట్లాడుతూ తాను వృత్తిరిత్యా వైద్యుడిని అయినప్పటికీ నాటక కళారంగం అంతరించిపోకుండా ఉండాలని ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో ఈ పౌరాణిక పద్య నాటకమును ప్రదర్శిస్తున్నామన్నారు. కార్యక్రమంలో దర్శకుడు రాజనాల, రాజశ్రీ రామారావు, వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ, విజయలక్ష్మి, రాధ, నీలిమ, మునిపల్లె శ్రీనివాస్, భరద్వాజ్, రామస్వామి పాల్గొన్నారు.

బంగారం కుదువపెట్టి నగదును తీసుకెళ్తున్నరైతు దృష్టి మరల్చి..
కారులో ఉన్న రూ.14లక్షల75వేల నగదు అపహరణ

వనస్థలిపురం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): బ్యాంక్‌లో బంగారం కుదువపెట్టి నగదును తీసుకెళ్తున్న రైతు దృష్టి మరల్చిన ఇద్దరు గుర్తు తెలియని దుండగులు కారులో ఉన్న నగదును ఎత్తుకెళ్లిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాదర్‌గుల్‌కు చెందిన రైతు ఎల్లకొండ మల్లారెడ్డి(42) సోమవారం మధ్యాహ్నం వనస్థలిపురం రైతు బజార్ సమీపంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంక్‌లో తన వద్ద ఉన్న 22తులాల బంగారు ఆభరణాలను కుదువపెట్టి రూ.14లక్షల75వేల రుణం తీసుకున్నాడు. ఆ నగదును తన కారులో పెట్టుకుని తన గ్రామమైన నాదర్‌గుల్‌కు వెళ్తున్నాడు. ఇదంతా గమనించిన ఇద్దరు గుర్తుతెలియని దుండగులు కారును వెంబడించారు. ఎన్జీవోస్‌కాలనీ వద్దకు రాగానే సదరు దుండగులు కారును ఆపి కారు పంచర్ అయిందని చెప్పి అతని కారును సమీపంలోని పంచర్ దుకాణానికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో బాధితుడు మల్లారెడ్డి తన కారుకు పంచర్ చేపిస్తుండగా అతని దృష్టి మరల్చి కారులో ఉన్న డబ్బులను తీసుకుని తమ ద్విచక్ర వాహనంపై పారిపోయారు. కారు పంచర్ చేయించిన అనంతరం బాధితుడు తన కారులో ఉన్న నగదు బ్యాగ్ కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపడుతున్నారు. సమాచారం అందుకున్న ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డిలు సంఘటన స్థలాన్ని పరిశీలించి వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. దుండగులే కారు టైరుకు పంచర్ చేసి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

నేడే ఓట్ల లెక్కింపు

- లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి
- సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఎల్‌బీనగర్ సెగ్మెంట్ ఓట్ల లెక్కింపు

ఎల్‌బీనగర్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల మహాక్రతువు చివరి అంకం ఓట్ల లెక్కింపు మంగళవారంతో ముగియనుంది. నెల రోజులకు పైగా సాగిన ఈ మహాక్రతువులో నామినేషన్ల దాఖలు మొదలు అభ్యర్థుల ప్రచార హోరు, పోలింగ్ అనంతరం ఈవీఎంలలో నిక్షిప్తమై ఉన్న అభ్యర్థుల భవితవ్యం మంగళవారంతో వెల్లడికానుంది. మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలోని ఎల్బీనగర్ సెగ్మెంట్‌లో పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య తరలించి సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలోని స్ట్రాంగ్‌రూంలో భద్రపర్చిన విషయం విదితమే. మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలోని ఎల్బీనగర్ సెగ్మెంట్ పరిధిలోని మొత్తం 6,04,763 ఓటర్లకు గాను 2,79,795 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో 1,45,787 మంది పురుషులు, 1,33,977 మంది మహిళలు, 31 మంది ఇతరులు ఉన్నారు. ఎల్బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియను సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో మంగళవారం చేపట్టనున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిర్వహించడానికి ఇండోర్ స్టేడియంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓట్ల లెక్కింపు అనంతరం వివరాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించనున్నారు.

ఓట్ల లెక్కింపు కోసం 28 టేబుళ్లు..

ఎల్‌బీనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించిన ఈవీఎంలలోని ఓట్లు లెక్కించడానికి 28 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఎల్బీనగర్ సెగ్మెంట్‌లో పోలైన ఓట్ల ప్రకారం 15టేబుళ్లపై 20రౌండ్లు, 13 టేబుళ్లపై 21 రౌండ్ల ఓట్లు లెక్కింపు చేపట్టనున్నారు. ఈ టేబుళ్లపై ఈవీఎంలను అమర్చి ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టనున్నారు. ఓట్ల లెక్కింపు టేబుళ్లకు, కౌంటింగ్ ఏజెంట్లు కూర్చునే ప్రాంతానికి మధ్య బారికేడ్లను అమర్చారు. ఏజెంట్లకు పార్టీల వారీగా స్థానాలు కేటాయించారు. వీటికి తోడు ఒక టేబుల్ సహాయ రిటర్నింగ్ అధికారి వద్ద ఉంటుంది. ఓట్ల లెక్కింపు కోసం ఒక్కో టేబుల్‌కు లెక్కింపు పర్యవేక్షకుడు, సహాయకుడు, సూక్ష్మ పరిశీలకుడు ఇలా ముగ్గురు ఉంటారు. సాధారణ పరిశీలకుడి టేబుల్ వద్ద ఒక సహాయకుడు, ఇద్దరు సూక్ష్మ పరిశీలకులు ఉంటారు. ఎల్బీనగర్ సెగ్మెంట్‌కు 87మంది కేవలం ఓట్ల లెక్కింపు టేబుళ్ల వద్దే ఉండేలా నియమించారు. వీరే కాకుండా సెగ్మెంట్‌కు 100మందిని ఇతర పనుల కోసం నియమించారు. రిజర్వులో మరో 28మందిని ఉంచారు.



ఎల్‌బీనగర్ సెగ్మెంట్ ఓట్ల లెక్కింపు కేంద్రమైన సరూర్‌నగర్ స్టేడియం

ఉదయం 7.30 గంటలకు లెక్కింపు ప్రక్రియ ప్రారంభం

మంగళవారం ఉదయం ఏడున్నర గంటలకు ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూంను ఎల్బీనగర్ సెగ్మెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పంకజ ఆధ్వర్యంలో అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో తెరిచి ఈవీఎంలను దశల వారీగా కౌంటింగ్ హాల్‌లకు తీసుకువస్తారు. సరిగ్గా 8గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించనున్నారు. ఈవీఎంలకు అనుసంధానం చేసిన పాడ్ యూనిట్ స్ర్కీన్‌పై కూడా ఈవీఎం స్ర్కీన్‌పై కనిపించే ఓట్ల వివరాలు కనిపిస్తాయి. ఈవీఎం యూనిట్ సిబ్బంది వైపు ఉంటే పాడ్ యూనిట్ స్ర్కీన్ లెక్కింపు ఏజెంట్ల వైపు కనబడేలా ఉంచుతారు. దీంతో ఏజెంట్లకు ఓట్లను చూసుకునేందుకు ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదు. రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు పూర్తి అయిన తర్వాత వివరాలు అందరికి కనిపించేలా తెరపై ప్రదర్శించనున్నారు.



ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన టేబుళ్లు, బారికేడ్లు

సాయంత్రం 4 గంటల వరకు లెక్కింపు

మంగళవారం సాయంత్రం 4గంటల వరకు ఎల్బీనగర్ సెగ్మెంట్ ఓటర్ల లెక్కింపు పూర్తవనుంది. ఓట్ల లెక్కింపు పూర్తి కాగానే వివరాలను సహాయ రిటర్నింగ్ అధికారి పంకజ మల్కాజిగిరి పార్లమెంట్ రిటర్నింగ్ అధికారికి సమర్పించనున్నారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అన్ని సెగ్మెంట్ల ఓట్ల వివరాలను క్రోడీకరించిన తర్వాత రిటర్నింగ్ అధికారి తుది ఫలితాన్ని ప్రకటించనున్నారు.

గుర్తింపు కార్డు ఉంటేనే అనుమతి..

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మొదలుకుని ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే సిబ్బంది, అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్, కౌంటింగ్ ఏజెంట్లు, మీడియా, పోలీస్ సిబ్బంది వరకు ప్రతి ఒక్కరికీ అధికారులు గుర్తింపు కార్డులు జారీ చేశారు. ఎవరైనా ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి వెళ్లాలంటే గుర్తింపు కార్డు ఉంటేనే అనుమతిస్తారు.

పటిష్ట బందోబస్తు..

రాచకొండ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు చర్యలు తీసుకుంటున్నారు. మూడంచెల భద్రతావ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ గుర్తింపు కార్డు లేని వారెవరిని లోనికి అనుమతించే ప్రసక్తే లేదని అధికారులు స్పష్టం చేశారు.

అర్హులైన వారందరికీ టీబీ నిరోధక టీకా

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

రంగారెడ్డి అర్బన్, జూన్ 3 : అర్హులైన వారందరికి టీబీ నిరోధక టీకా వేయడం జరుగుతుందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా క్షయ నిర్మూలన కార్యక్రమ (ఎన్‌టీఈపీ) ఆధ్వర్యంలో స్థానిక కామినేని ఆస్పత్రిలోని ఇందిరా ఆడిటోరియంలో ఇందుకు సంబంధించి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని పీహెచ్‌సీ, బస్తీదవాఖాన, పల్లె దవాఖాన వైద్యులకు, సూపర్ వైజర్లకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు ప్రారంభించారు. జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ అరుణకుమారి స్వాగతోపన్యాసం చేశారు. డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ ఎపి డామిల జిస్ట్ అడల్ట్ వ్యాక్సిన్‌కి సంబంధించి భవిష్యత్ కార్యాచరణపై వైద్యులకు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడారు. 2025 సంవత్సరం వరకు మన దేశంలో క్షయ వ్యాధిని పూర్తి స్థాయిలో నిర్మూలించాలనే లక్ష్యంలో భాగంగా 18ఏళ్లు పైబడిన వారందరికి క్షయ వ్యాధి టీకా వేయాలని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ నిర్ణయించిందన్నారు. జాతీయ ఆరోగ్యమిషన్(ఎన్‌హెచ్ఎం) ద్వారా ఈ టీకాల కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లాలో అమలు చేయనున్నట్లు చెప్పారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ అధ్యయన కార్యక్రమం(పైలెట్ ప్రాజెక్టు) కోసం మన రాష్ట్రంలో 17 జిల్లాలను ఎంపిక చేయగా, అందులో రంగారెడ్డి జిల్లా ఒకటి ఉందని చెప్పారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ స్వర్ణకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ గీత, డాక్టర్ వినోద్, డాక్టర్ అనిత, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంబిక పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎపి డామిల జిస్ట్

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి

- తన చావుకు ఎవరూ కారణం కాదని సూసైడ్ నోట్

కొత్తపేట: నాగోల్ పీఎస్ పరిధిలో అనారోగ్యంతో సతమతమైన ఓ వృద్ధురాలు రెండో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. తన చావుకు ఎవరూ కారణం కాదని సూసైడ్ నోట్‌లో వృద్ధురాలు స్పష్టం చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎం.నాగమణి(71) కుటుంబ సభ్యులతో ఇందూ అరణ్య పల్లవి అపార్టుమెంట్ రెండో అంతస్తు బీ 5, 204 ఫ్లాట్‌లో నివాసముంటుంది. 4 సంవత్సరాలుగా ఆమె అనారోగ్యంతో సతమతమవుతుంది. దీంతో ఆమె మానసికంగా తీవ్ర ఆందోళనకు గురయ్యేది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత(సోమవారం) 12.30 గంటల ప్రాంతంలో ఆమె రెండో అంతస్తుపై నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు యత్నించింది. విషయం తెలుసుకున్న కుమారుడు ఎం.లక్ష్మీనర్సింహ వెంటనే 100 సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. సమాచారం అందుకున్న నాగోల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తీవ్ర గాయాలపాలైన వృద్ధురాలిని 100 వాహనంలో వారు చికిత్స నిమిత్తం నాగోల్ సుప్రజ ఆస్పత్రికి తరలించారు. ఆమె వద్ద లభ్యమైన సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నారు. తన చావుకు ఎవరూ బాధ్యులు కాదని, తనను కుటుంబ సభ్యులు బాగా చూసుకున్నారని వృద్ధురాలు సూసైడ్ నోట్‌లో స్పష్టం చేసింది. చికిత్స పొందుతూ తెల్లవారు జామున ఆమె మృతిచెందింది. మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరు పాత నేరస్థులు, ఓ విద్యార్థి అరెస్టు

- 5 తులాల బంగారు పుస్తెల తాడు, 3 సెల్‌ఫోన్లు, బైకు స్వాధీనం



మాస్కులతో ఉన్న నేరస్థులు, స్వాధీనం చేసుకున్న సొత్తు, కేసును ఛేదించిన సిబ్బందితో ఎస్‌హెచ్‌ఓ పరశురామ్

కొత్తపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చైన్ స్నాచింగ్ కేసులో ముగ్గురు నిందితులను నాగోల్ పోలీసులు అరెస్టు చేసి సొత్తు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఇద్దరు పాత నేరస్థులు కూడా ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల ఒకటో తేదీన మరిపల్లిలో ఓ వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెల గొలుసును తెంచుకుని బైకుపై పరారైన ఇద్దరు నిందితులను నాగోల్ పోలీసులు ఈనెల 2న గౌరెల్లి చౌరస్తాలో అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో మరో నిందితుడు వారికి సహకరించినట్లు తేలడంలో అతడిని అరెస్టు చేశారు. 5 తులాల బంగారు పుస్తెల గొలుసు, 3 సెల్‌ఫోన్లు, బైకు స్వాధీనం చేసుకున్నారు. 2018లో ఆదిబట్ల పీఎస్ పరిధిలో మాదకద్రవ్యాల కేసులో అరెస్టైన నల్లగొండకు చెందిన క్యాబ్ డ్రైవర్ మునగాల శివారెడ్డి(28), గతేడాది మీర్‌పేట పీఎస్ పరిధిలో మాదకద్రవ్యాల కేసులో అరెస్టైన నల్లగొండ కనగల్ మండల్ బాబాసాహెబ్‌గూడెంకు చెందిన సుంకిరెడ్డి శశిధర్‌రెడ్డి అలియాస్ శశిధర్(30), నల్లగొండ శ్రీనగర్‌కాలనీకి చెందిన దేవులపల్లి సాయికుమార్‌రెడ్డి(20) స్నేహితులు. సాయికుమార్‌రెడ్డి ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వార్డుబాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ ముగ్గురూ ఎల్‌బీనగర్ పరిధి ఎన్టీఆర్‌నగర్‌లో ఓ అద్దె గదిలో ఉంటున్నారు. జల్సాలకు, చెడు అలవాట్లకు బానిసలై నేరాల బాట పట్టారు. ఒకటో తేదీన మరిపల్లిలో శశిధర్‌రెడ్డి, సాయి కుమార్‌రెడ్డి చైన్‌స్నాచింగ్‌కు పాల్పడి పరారయ్యారు. దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించి, నిందితులను పట్టుకున్నారు. నిందితులను రిమాండుకు తరలించారు.

గాయం ఒక చోట మందు మరో చోట..?

- కాల్వపైన అక్రమ నిర్మాణం తొలగించకుండా మరో చోట తొలగింపులు
- మునగనూరులో యథావిధిగానే కాల్వపైన అక్రమ నిర్మాణం..?

హయత్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మునగనూర్ గ్రామంలో కాల్వ పైన నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించడంలో అధికారులు ఆసక్తి కనబరచడం లేదు. బాధ్యతగల అధికారులు ఇరిగేషన్, మున్సిపాలిటీ కింది స్థాయి సిబ్బందిని పంపించి తూ తూ మంత్రంగా పనులు చేసుకుని వచ్చారు. పుండోచోట.. మందు ఓ చోట అన్నట్లుగా 33 ఫీట్ల ఇరిగేషన్ కాల్వపైన ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించిన దాన్ని తొలగించకుండా ఇరిగేషన్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది సోమవారం వెనుదిరిగారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన 'మునగనూర్‌లో అధికారులకే సవాలు విసురుతున్న బిల్డర్లు, అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అబ్దుల్లాపూర్‌మెట్ ఇరిగేషన్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించారు. సోమవారం కాల్వపైన నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని తొలగించేందుకు జేసీబీతో సిబ్బంది అక్కడకు వెళ్లగా ఓ మహిళా, మరో వ్యక్తి వచ్చి అడ్డుకోవడంతో చేసేది లేక ఇరిగేషన్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, టౌన్‌ప్లానింగ్ చైన్‌మెన్‌లు అక్కడి నుంచి వెళ్లిపోయారు. మునగనూర్ గ్రామంలోనే అక్కడక్కడ కాల్వపైన నిర్మించిన కొన్ని కట్టడాలను తాత్కాలికంగా తొలగించి చేతులు దులుపుకున్నారు. కాల్వపైన ఒక చోట రెండు అంతస్తుల భవనాన్నే నిర్మించడం విశేషం. పై స్థాయి అధికారులు లేకపోవడంతో కింది స్థాయి సిబ్బంది ఏమి చేయలేక వచ్చారు.

ఎన్నికల ఫలితాల తర్వాత వస్తాం: టీపీఓ శ్రీనివాస్

మంగళవారం ఎన్నికల ఫలితాలు ఉన్నందున రెండు రోజులు ఆగి పోలీసులతో వచ్చి అక్రమంగా నిర్మిస్తున్న వాటిని తొలగిస్తాం.

కాల్వపైన నిర్మించిన భవనానికి మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. అనుమతి కోసం దరకాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇరిగేషన్ కాల్వలపైన అనుమతులు ఇవ్వడం కుదరదని తెలిపారు.



సాగునీటి కాల్వపైన నిర్మించిన బెస్‌మెంట్‌ను తొలగించకుండా జేసీబీకి అడ్డంగా నిలబడిన మహిళ

కాల్వనే మార్చారు..

కాల్వపైన ఎలాంటి అనుమతులు లేకుండా భవనాన్ని నిర్మిస్తూ ప్రస్తుతం ఉన్న సాగునీటి కాల్వను పక్క నుంచి తీసి మరో వ్యక్తి ప్లాటులోనికి తిప్పడం గమనార్హం. సదరు ప్లాట్ల యజమానులకు డాక్యుమెంట్‌లో ఉన్న దాని కంటే ఎక్కువ స్థలాన్ని ఆక్రమించి భవనాలను నిర్మిస్తున్నారని స్థానికులు తెలిపారు. మున్సిపాలిటీ అనుమతి లేదు, కాల్వపైన నిర్మిస్తున్న భవనానికి విద్యుత్ మీటరు ఎలా ఇచ్చారని పలువురు గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు సాగునీటి కాల్వపైన అక్రమంగా నిర్మిస్తున్న భవనాలను తొలగిస్తారా.. లేక తమకెందుకులే అని వదిలేస్తారా వేచి చూడాలిమరి.

పౌరహక్కుల నేతను వెనక్కి పంపిన పోలీసులు

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పౌరహక్కుల నేత వెంకటరమణిని పోలీసులు వెనక్కి పంపించారు. స్వీడన్ పౌరసత్వం కలిగిన వెంకటరమణిపై భారత ప్రభుత్వం నిషేధం విధించింది. వెంకటరమణి వస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు ఆయన్ను శంషాబాద్ విమానాశ్రయంలో అడ్డుకున్నారు. 'వెంకటరమణిపై ప్రభుత్వం నిషేధం ఉంది. ఇక్కడికి వచ్చేందుకు ప్రయత్నిస్తే అడ్డుకున్నాం. విమానాశ్రయం నుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు." అని పోలీస్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

మూసారాంబాగ్ రెడ్ రోజ్ బేకరీలో అగ్నిప్రమాదం

చాదర్‌ఘాట్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ చౌరస్తాలోని మహ్మదీయ మజీద్ ఆవరణలో ఉన్న రెడ్ రోజ్ బేకరీలో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. తెల్లవారుజామున నాలుగున్నర గంటల ప్రాంతంలో రెడ్ రోజ్ బేకరీ నుంచి దట్టమైన పొగలు రావడాన్ని స్థానికులు గమనించి అగ్నిమాపక దళానికి, మలక్‌పేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే రంగంలోకి దిగిన అగ్నిమాపక దళం మంటలను ఆర్పేందుకు చర్యలు చేపట్టారు. అప్పటికే బేకరీలోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. బేకరీ యజమాని మహ్మద్ అహ్మద్ 1970 నుంచి రెడ్ రోజ్ బేకరీ నిర్వహిస్తున్నాడు. ప్రతి రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి బేకరీని మూసి వేశాడని, తెల్లవారుజామున నాలుగున్నర గంటల ప్రాంతంలో బేకరీలో అగ్నిప్రమాదం సంభవించినట్లుగా తనకు కూడా సమాచారం అందిందని మలక్‌పేట పోలీసులకు వివరించాడు. ఇది ప్రమాదవశాత్తు జరిగిందా లేక విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిందా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే బేకరీలో అగ్నిప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. దాదాపు రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కేసును మలక్‌పేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు

అతిగా నవ్వుతూ..!

- పగలబడి నవ్వుతూ స్పృహ కోల్పోయిన వ్యక్తి
- కాసేపు అచేతనం.. తర్వాత సాధారణ స్థితికి
- అపోలోకి తరలింపు ● ఏమీ కాలేదని తేల్చిన వైద్యులు
- నవ్వు ప్రేరిత సింకోప్‌గా నిర్ధారణ

నవ్వు ఆరోగ్యానికి మేలు చేస్తుందని అంటారు. అలాగే నవ్వు నాలుగు విధాల చేటు చేస్తుందని కూడా అంటారు. కొందరి విషయంలో పరిశీలిస్తే నిజమే అనిపిస్తోంది. ఓ వ్యక్తి విషయంలో ఇలాగే జరిగింది. టీవీలో కామెడీ షో చూసి విరగపడి ఎక్కువ సేపు నవ్వుతూనే అకస్మాత్తుగా అచేతనంగా కిందపడిపోయాడు. అతన్ని పరిశీలించిన వైద్యులు దాన్ని మూర్ఛకు సంబంధించిన.. స్పృహ కోల్పోయిన సమస్యగా నిర్ధారించారు. ఈరకం జబ్బుతో బాధపడే వారు కూడా ఉంటారా.. అని ఆశ్చర్యమనిపిస్తుంది. అవును ఇలాంటి ఓ కేసు అపోలో ఆస్పత్రి న్యూరాలజిస్టు డాక్టర్ సుధీర్‌కుమార్ వద్దకు వచ్చింది. ఆయన ఈ కేసు వివరాలను తన ఎక్స్(ట్విటర్) ఖాతాలో పంచుకున్నారు.

- హైదరాబాద్ సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి):

హైదరాబాద్‌కు చెందిన 53 ఏళ్ల ఓ వ్యక్తి విపరీతమైన నవ్వుతో స్పృహ కోల్పోవడంతో ఆస్పత్రికి తరలించారు. వారం, పది రోజుల క్రితం సదరు వ్యక్తి కుర్చీలో కూర్చుని టీ తాగుతూ తన కుటుంబంతో కలిసి టీవీలో కామెడీ షో చూస్తున్నాడు. ఆ షోలో ఒక అంశం ఆయనకు విపరీతమైన నవ్వును తెప్పించింది. నవ్వును అదుపు చేసుకోలేనంతగా కొన్ని నిమిషాల పాటు పగలబడి ఆగకుండా నవ్వాడు. ఈ క్రమంలో అతను నియంత్రణ కోల్పోయాడు. కొద్దిసేపటి తర్వాత, అతని శరీరం ఒక వైపునకు వంగి, కుర్చీ నుంచి నేలపై పడిపోయి స్పృహ కోల్పోయాడు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేస్తున్న సమయంలో కళ్లు తెరిచి, తన శరీరాన్ని కదిలించడంతోపాటు మాట్లాడగలిగాడు. ఈ క్రమంలో అతన్ని జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రికి తరలించారు. ఎమర్జెన్సీ రూమ్‌కి తీసుకొచ్చేసరికి పూర్తిగా కోలుకున్నాడు. పరిశీలించిన వైద్యులు అతనికి ఎలాంటి హానీ జరగలేదని, అనారోగ్యం ఏమీ లేదని నిర్ధారించారు. అతన్ని న్యూరాలజిస్టు డాక్టర్ సుధీర్‌కుమార్ పరిశీలించి ఈ పరిస్థితిని నవ్వు ప్రేరిత సింకోప్ (Laughter-induced syncope)గా నిర్ధారించారు. ఇది వాసోవాగల్ మెకానిజమ్స్ వల్ల ఏర్పడే అరుదైన అంశంగా ఆయన గుర్తించారు. ఇది ఒక విధమైన మూర్ఛకు సంబంధిత సమస్య అని, ఎలాంటి మందులు అవసరం లేదని, ప్రాణానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని తేల్చారు.



(ఫైల్ ఫొటో)

అధికనవ్వుతో రక్తసరఫరా తగ్గే ప్రమాదం..

విపరీతమైన నవ్వుతో ఒక్కోసారి రక్తపోటు వేగంగా తగ్గిపోతుందని, నాడీ వ్యవస్థ నుంచి అధిక ప్రతిస్పందనను ప్రేరేపిస్తుందని డాక్టర్ సుధీర్‌కుమార్ వివరించారు. దీని వల్ల మెదడుకు ప్రవహించే రక్త సరఫరా తాత్కాలికంగా తగ్గుతుందని, ఫలితంగా స్పృహ కోల్పోయే ముప్పు ఉంటుందన్నారు. విపరీతమైన నవ్వు ఎక్కువసేపు నిలబడటం, అధిక శారీరక శ్రమ వంటి మూర్ఛ సాధారణ ట్రిగ్గర్‌లను నివారించాలని డాక్టర్ సూచించారు. బీపీ మందులు వినియోగిస్తున్నవారు, గుండె జబ్బులు ఉన్నవారు అతిగా, బిగ్గరగా నవ్వొద్దని ఆయన సూచిస్తున్నారు. ప్రమాదం లేమీ లేకపోయినప్పటికీ రక్త ప్రసరణలో మార్పులు చోటు చేసుకుంటాయని చెప్పారు. 'ఎప్పుడు నవ్వుతూ.. సంతోషంగా ఉండాలని, సంతోషమే సగం బలమని వైద్యులు తరుచూ చెబుతుంటారు. కానీ, దేనిని అతిగా తీసుకోవడం మంచిది కాదని ఈ కేసులో నిరూపితమైంది' అని డాక్టర్ సుధీర్‌కుమార్ వివరించారు.